క్లుప్తంగా

ఓపెన్ టెన్త్‌పై అవగాహన సదస్సు

పెద్దకొత్తపల్లి: మహిళలలో అక్షరాస్యత పెంచేందుకు ఓపెన్ టెన్త్ ద్వారా పరీక్షలు రాయవచ్చునని మండలంలోని బుక్ కీపర్లకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో మహిళల సంఘాల్లో ఉన్న సభ్యులు ఓపెన్ పరీక్ష 10వ తరగతి విద్యార్హత సాధించాలన్నారు. కార్యక్రమంలో మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాలు అరుణ, సిబ్బంది శివ, ఈశ్వర్ పాల్గొన్నారు.

వన మహోత్సవానికి మొక్కలు సిద్ధం చేయాలి

చారకొండ: గ్రామాల్లో నర్సరీల్లో పెంచిన మొక్కలను త్వరలో నిర్వహించే వన మహోత్సవానికి సిద్ధం చేయాలని ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ కోరారు. మండలంలోని మర్రిపల్లిలో శుక్రవారం నర్సరీలను, కంపోస్టు షెడ్డును ఆయన పరిశీలించారు. నర్సరీలో పెరిగిన మొక్కలను వాటి సంరక్షణకు నీటి సరాఫరా సక్రమంగా ఉందా, కంపోస్టు షెడ్‌లో చెత్తను వేరుచేస్తున్నారా తదితర వాటిపై ఆరా తీశారు. ఎంపీఓ నారాయణ, పంచాయతీ కార్యదర్శులు గణేష్, రవి శంకర్, ఫీల్డ్ అసిస్టెంట్ రాధమ్మ, తదితరులు ఉన్నారు.

పీర్లకు దట్టీలు సమర్పణ

చారకొండ: మండలంలోని జూపల్లిలో శుక్రవారం మొహర్రం పండగ సందర్భంగా పీర్ల చావిడిలో కొలువుదీరిన చిన్న సరిగెత్తు ఘనంగా నిర్వహించారు. చావడి ఎదుట అగ్నిగుండం, డప్పు చప్పుళ్లతో అలయ్ బలయ్ ఆడారు. ఈ సందర్భంగా వెల్దండ సింగిల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కర్‌రావు పీర్లకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి దట్టీలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మొల్ల నిర్వాహకులు జమీర్, కుద్దుస్, గ్రామస్తులు ఖాజామియా, ఖాసీం, మల్లేష్, సిరాజ్, షబ్బీర్, అక్రం, యాసుఫ్ ఉన్నారు.

రియల్‌ఎస్టేట్ వ్యాపారి ఇంటి ఎదుట నిరసన

నాగర్‌కర్నూల్ క్రైం: ప్లాటు రిజిస్ట్రేషన్ చేయకుండా కాలయాపన చేస్తు మోసం చేశాడని రియల్‌ఎస్టేట్ వ్యాపారి ఇంటి ఎదుట నిరసనకు దిగిన సంఘటన జిల్లా కేంద్రంలోని హౌజింగ్‌బోర్డుకాలనీలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీకి చెందిన సాయి ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారికి ఏడాది కిందట డబ్బులు చెల్లించిన ప్లాట్ రిజిస్ట్రేషన్ చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తుండటంతో శుక్రవారం రియల్‌ఎస్టేట్ వ్యాపారి ఇంటి ఎదుట టెంటు వేసుకుని కుటుంబసభ్యులతో కలిసి బైఠాయించారు. న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

కళ్లకు గంతలు కట్టుకొని నిరసన

కొల్లాపూర్: పట్టణంలో టీయూడబ్ల్యూజేఎఫ్ ధ్వర్యంలో జర్నలిస్టులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష పదో రోజు శుక్రవారం కొనసాగింది. శిబిరంలో జర్నలిస్టులు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. పలువురు ప్రజాసంఘాల నాయకులు దీక్షలకు సంఘీభావం ప్రకటించారు. స్థానిక మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించి జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. దీక్షలో కూర్చున్న వారిలో తాటికొండ కృష్ణ, రాంచందర్, మల్లికార్జున్, జలకం మద్దిలేటి, కురుమయ్య, సీపీ నాయుడు, భానుప్రకాష్, గోవిందు, కేశవులు, స్వాములు తదితరులు ఉన్నారు.

13న కంటి వైద్య శిబిరం



కల్వకుర్తి రూరల్: పట్టణంలో ఈ నెల 13న కంటి వైద్య శిబిరం నిర్వహిస్తునట్లు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం శిబిరం ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. నియోజకవర్గంలో ఉన్న శిబిరానికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

డీవైఎఫ్ఐ నాయకుల ముందస్తు అరెస్టు

నాగర్‌కర్నూల్ రూరల్: ఉద్యోగాల సాధన కోసం డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సచివాలయం ముట్టడికి పిలుపునిచ్చారు. ఈమేరకు డీవైఎఫ్ఐ నాయకులు తరలివెళ్లకుండా ముందస్తుగా శుక్రవారం జిల్లాలోని పోలీసులు ముందస్తు అరెస్టులు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. జిల్లా కార్యదర్శి మధు, అశోక్, నాయకులు కుర్మయ్య తదితరులు ఉన్నారు.

7న రెవెన్యూ మేళా

కందనూలు: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ఈ నెల 7వ తేదీ నుంచి 11 వరకు జిల్లా కేంద్రం పురపాలిక కార్యాలయంలో రెవెన్యూ మేళా నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో దరఖాస్తులు అందజేయాలన్నారు. మేళాలో నూతన ఇంటినెంబర్, ఇంటిపేరు మార్పిడి, పేరు సవరణ, ట్యాక్స్ రివిజన్, తండ్రి, భర్త పేరు సరిచేసేందుకు అవకాశం కల్పిస్తామన్నారు.

సెల్లార్‌లో అక్రమ వ్యాపారాలు

- నిబంధనలు విరుద్ధంగా పార్కింగ్
- పట్టించుకోని అధికారులు



అచ్చంపేటలోని లింగాల రోడ్డులో సెల్లార్‌లో వ్యాపార సముదాయం



రోడ్డుపైనే నిలిపిన వాహనాలు

అచ్చంపేట రూరల్: పట్టణం దినదినాభివృద్ధి చెందుతోంది. దీనికి అనుగుణంగా వ్యాపార సముదాయాలు కూడా పెరుగుతున్నాయి. పట్టణంలోని ప్రధాన రహదారి, లింగాల రోడ్డు, ఉప్పునుంతల రోడ్డుతో పాటు పలు ప్రాంతాల్లో భవనాల యజమానులు పార్కింగ్ స్థలాలను అక్రమంగా వ్యాపారాలకు వినియోగిస్తున్నారు. నిబంధనల ప్రకారం సెల్లార్లు మొత్తం వాహనాల పార్కింగ్‌కు కేటాయించాలి. ఇందుకు భిన్నంగా పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట ఉన్న భారీ భవనాల సెల్లార్లలో వ్యాపార దుకాణాలు వెలుస్తున్నాయి. ఆయా భవనాలు నిర్మించే సమయంలో పట్టణ ప్రణాళిక విభాగానికి సెల్లార్లను పార్కింగ్‌కు కేటాయిస్తున్నట్లు ప్రణాళికలో చూపుతున్నారు. భవన నిర్మాణం పూర్తిచేసి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ పొందాక సెల్లార్లలో మళ్లీ నిర్మాణం చేపట్టి దుకాణాలకు కేటాయిస్తున్నారు. తద్వారా భవనాల యజమానులు భారీగా అద్దెలు పొందుతున్నారు. వీటిపై పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు దృష్టి సారించకపోగా నిర్మాణ సమయంలోనే యజమానుల నుంచి అందినకాడికి దండుకుంటున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

తప్పని ట్రాఫిక్ సమస్య..

పట్టణంలోని పాతబజార్, లింగాల రోడ్డు, ఉప్పునుంతల రోడ్డు, ఆర్టీసీ బస్టాండు ప్రాంతాల్లో ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న భవనాల్లో సెల్లార్లు మొత్తం దుకాణాలతో నిండి ఉన్నాయి. లింగాల రోడ్డులో అధికంగా కన్పిస్తున్నాయి. ఆయా దుకాణాలకు వచ్చే వినియోగదారులు తమ వాహనాలను ప్రధాన రహదారిపై నిలపాల్సి వస్తోంది. ఈక్రమంలో ప్రధాన రహదారిపై ప్రయాణించే వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు పోలీసులు రోడ్డుపై నిలిపిన వాహనాలకు ఫైన్లు వేస్తున్నా... సమస్య పరిష్కారం కావడం లేదు. భవన యజమానులు చేసే తప్పులకు వాహనదారులు శిక్ష అనుభవించాల్సి వస్తోంది. ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రంగా మారే అవకాశం ఉంది. మున్సిపల్ అధికారులు ఇకనైనా సెల్లార్లలో దుకాణాలను తొలగించి వాటిని వాహనాల పార్కింగ్‌కు వినియోగించేలా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

నిబంధనలు పాటించాల్సిందే..



భవనాల యజమానులు సెల్లార్లను వాహనాల పార్కింగ్‌కు మాత్రమే వినియోగించాలి. నిర్మాణ సమయంలో పార్కింగ్ చోటు చూపిస్తున్న యజమానులు తర్వాత సెల్లార్లలో నిర్మాణాలు చేపట్టి ఉంటారు. ఇలాంటి భవనాలను పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– మురళి, మున్సిపల్ కమిషనర్, అచ్చంపేట

నాణ్యమైన భోజనం అందించాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ బన్సీలాల్

కోడేరు: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆర్డీఓ బన్సీలాల్ వంట ఏజెన్సీలకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. గుడ్లు, పండ్లు మెనూ ప్రకారం అందించాలన్నారు. వర్షాకాలం కావడంతో కూరగాయలు శుభ్రంగా కడిగి వంట చేయాలని ఏజెన్సీలకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, రెవెన్యూసిబ్బంది సురేందర్, మహేశ్, జమ్ములయ్య, పంచాయతీ కార్యదర్శి రవితేజ తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలకు శిక్షణ

మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శుక్రవారం బీఎల్‌ఓలకు ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. ఆర్డీఓ బన్సీలాల్ హాజరై మాట్లాడారు. బీఎల్‌ఓలు కొత్త ఓటరు నమోదు చేయించాలని, మరణించిన వారి పేర్లు ఓటరు జాబితానుంచి తొలగించాలన్నారు. మార్పులు, చేర్పులు ఉంటే ఫారమ్–8 ద్వారా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్, రెవెన్యూ సిబ్బంది సురేందర్, మహేశ్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి పోరాటం స్ఫూర్తిదాయకం



కొల్లాపూర్: స్వాతంత్ర్య ఉద్యమంలో అల్లూరి సీతారామరాజు పోరాటం స్ఫూర్తిదాయకమని అల్లూరి స్వచ్ఛంద సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, వెంకటయ్యలు అన్నారు. శుక్రవారం పట్టణంలో అల్లూరి 128వ జయంతిని ఘనంగా నిర్వహించారు. అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బాబు, సుధాకర్, ఆనంద్, పాషాతోపాటు ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

చిత్రపటాలు పంపిణీ

తాడూరు: క్లాస్‌మెట్ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని బలాన్‌పల్లిలో శుక్రవారం ప్రాథమిక పాఠశాలలో అల్లూరి సీతారామరాజు జయంతి నిర్వహించారు. ఎలక్ట్రికల్ బెల్‌తోపాటు, జాతీయ నాయకుల చిత్రపటాలను అందజేశారు. పాల శ్రీనివాసు, ప్రసాద్, హెచ్ఎం రమేష్, ప్రకాష్ పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

అచ్చంపేట రూరల్: హామీల అమలులో ప్రభుత్వం విఫలం అయ్యిందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు అన్నారు. శుక్రవారం పట్టణంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు గండు శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రచ్చబండలో ఆయన మాట్లాడారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను పరిష్కరించే వరకు నిరసన, ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

తెలకపల్లి: అథ్లెటిక్‌రాష్ట్రస్థాయి పోటీలకు ఆలేరు పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం నరహరి, బాలయ్య, బచ్చన్న ఉపాధ్యాయులు తెలిపారు. జూన్ 22న కల్వకుర్తి బాలుర పాఠశాలలో జరిగిన పోటీల్లో విద్యార్థిని మధుప్రియ అండర్–14 బాలికల విభాగంలో ప్రతిభ కనబర్చారు. మహాలక్ష్మి పరుగు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు.

వసతి గృహాల్లో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం

బిజినేపల్లి: వసతి గృహాల్లో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామని డిప్యూటీ డీఎంహెచ్ఓ వెంకటదాస్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పాలెం బీసీ, ఎస్సీ వసతి గృహాలను స్థానిక పీహెచ్‌సీ వైద్య సిబ్బందితో కలిసి ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. పాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డా. ప్రియాంక, హెల్త్ అసిస్టెంట్ గోవర్ధన్, సిబ్బంది రాజేశ్వర్, గజవర్ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం

పెంట్లవెల్లి: మండల కేంద్రలోని జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో చదివిన 1992–93 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి వరదాచారి ఇటీవల మృతి చెందాడు. తోటి మిత్రులు డబ్బులను పోగు చేసుకొని శుక్రవారం మృతుడి భార్యకు రూ.70వేలు ఆర్థికసాయం అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నిరంజన్‌గౌడ్, నాగార్జున, భగవంత్, సుబ్రమణ్యం, వాసు తదితరులు పాల్గొన్నారు.

వైద్యవిద్యార్థికి ఆర్థిక చేయూత



వెల్దండ: మండలంలోని రాచూర్ ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థి ఎంబీబీఎస్ చదువుతున్న కొమ్ము సింధూర కుటుంబానికి శుక్రవారం క్లాస్‌మేట్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీవాస రాఘవేందర్ సహకారంతో రూ.50వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. దాతలు మహబూబ్‌నగర్‌కు చెందిన డాక్టర్ శశికాంత్ రూ.25వేలు, కల్వకుర్తికి చెందిన డాక్టర్ శరత్‌చంద్ర రూ.10వేలు, వాస రాఘవేందర్ టీచర్ రూ.10వేలు, ఎస్.రవీందర్ టీచర్ రూ.2,500, కొప్ర టీచర్ సంధ్య రూ.2,500 చొప్పున విద్యార్థిని తల్లిదండ్రులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి అధ్యక్షుడు పోరెడ్డి రాజేందర్, ప్రధాన కార్యదర్శి సాయిబాబు, కోశాధికారి కిషన్, జిల్లా కార్యదర్శి శోభన్‌బాబు, వెల్దండ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, హెచ్‌హెం జంగయ్య, ఉపాధ్యాయులు రాంకిషన్‌రావు, మురళీమనోహర్, జైపాల్, సురేష్ తదితరులు ఉన్నారు.

బహిరంగ సభకు తరలిన కాంగ్రెస్ నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సమక్షంలో హైదరాబాద్‌లో నిర్వహించిన బహిరంగ సభకు శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి కాంగ్రెస్ నాయకులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. తిమ్మాజిపేట, వెల్దండ, మన్ననూరు, కల్వకుర్తి రూరల్ పరిధి నుంచి ఆ పార్టీ నాయకులు వివిధ వాహనాల్లో బయలుదేరారు. కార్యక్రమంలో తిమ్మాజిపేట మండల అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి, కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, మిరియాల శ్రీనివాస్ రెడ్డి, దామోదర్ గౌడ్, విజయ భాస్కర్, భూపతిరెడ్డి, మోతిలాల్‌నాయక్, సంజీవ్‌కుమార్‌యాదవ్, మట్ట వెంకటయ్యగౌడు, పర్వత్‌రెడ్డి, ఎర్రశ్రీను, రషీద్, వెంకట్‌రెడ్డి, రమేష్‌గౌడు తదితరులు ఉన్నారు.



మన్ననూరు నుంచి బయలుదేరుతున్న నాయకులు

దరఖాస్తుల ఆహ్వానం

వెల్దండ: మండల కేంద్రంలోని ఆదర్శ(మోడల్) స్కూల్‌లోని వసతి గృహంలోని ఖాళీగా ఉన్న ఏఎన్ఎం, అసిస్టెంట్ వంట మనిషిగా పనిచేసేందుకు దరఖాస్తులు చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంఈఓ చంద్రుడు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అదే విధంగా కస్తూర్బాగాంధీ పాఠశాలలో నైట్ వాచ్‌మెన్ పోస్టుకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. అసిస్టెంట్ కుక్ కోసం 7వ తరగతి ఉత్తీర్ణులైనవారు, ఏఎన్ఎంలకు, నైట్‌వాచ్ మెన్‌లకు 10వ తరగతి చదివి ఉండాలని తెలిపారు. ఆసక్తి గల వారు కస్తూర్బాగాంధీ పాఠశాల ప్రిన్సిపాల్ స్రవంతికి ఈ నెల 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

పెద్దకొత్తపల్లి: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి శిరీష అన్నారు. బాచారంలో జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ పథకంపై రైతులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. 125 మంది రైతులను ప్రకృతి వ్యవసాయం కోసం ఎంపిక చేశారు. పథకంలో వచ్చే ప్రయోజనాలను వివరించారు. రైతుల పొలాల్లో మట్టి నమూనాలను సేకరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ముజీబ్, బాలస్వామి, రవికుమార్, అనిల్, మల్లేష్, మధుసూదన్‌రెడ్డి, పంచాయితీ కార్యదర్శి నాగశేషి పాల్గొన్నారు.

మాయమాటలతో కాంగ్రెస్ కాలక్షేపం

పెంట్లవెల్లి: ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయకుండా మాయమాటలతో కాంగ్రెస్ కాలక్షేపం చేస్తుందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోతుల వెంకటేశ్వర్లు విమర్శించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజీవ్ యువవికాసం పేరులో నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు స్వీకరించి రుణాలు ఇవ్వకుండా అప్పుడు ఇప్పుడు అంటూ కాలయాపన చేయడం సరికాదన్నారు. పూర్తిస్థాయిలో రైతు భరోసా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడు పోతుల వెంకటేశ్వర్లు, సింగిల్‌విండో చైర్మన్ విజయరామారావు, మాజీ సర్పంచ్ రాజేష్, ఎస్‌కే ఖాజా, సురేందర్‌గౌడ్, రఫియోద్దీన్‌లు పాల్గొన్నారు.

స్వచ్ఛ పర్యవేక్షణపై అవగాహన

లింగాల: మండలంలోని అప్పాయపల్లి, చెన్నంపల్లి, పద్మన్నపల్లి పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులకు స్వచ్ఛ పర్యవేక్షణపై శుక్రవారం మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ అవగాహన కల్పిస్తూ పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయా పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఈఓ విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. వర్షాకాలం కావడంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఆయా పాఠశాలలో మొక్కలను నాటారు. హెచ్ఎంలు అరవింద్, సతీష్‌కుమార్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ సాయికిరణ్, సీఆర్పీ హరిలాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య వర్ధంతి

నాగర్‌కర్నూల్ రూరల్: తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్వకుర్తి రూరల్: రైతన్న సమస్యలపై పోరాడిన యోధుడు దొడ్డి కొమురయ్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆంజనేయులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో కొమురయ్య వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆంజనేయులు, శ్రీనివాసులు, బాలయ్య, శ్రీనివాసులు, జగన్, చంద్రయ్య, పర్వతాలు, మల్లేష్ పాల్గొన్నారు.

సరిపడా యూరియా సరఫరా చేస్తాం

సాక్షి ఎఫెక్ట్..

లింగాల: రైతులకు సరిపడా యూరియా అందజేస్తామని మండల వ్యవసాయాధికారి జి.అనిల్ తెలిపారు. శుక్రవారం 'యూరియా కోసం రైతుల అవస్థలు' శీర్షికతో వార్త ప్రచురితం అయ్యింది. ఈ మేరకు ఏఓ స్పందించారు. యూరియా గురించి ఎలాంటి ఆందోళనకు గురికావద్దని మండల వ్యవసాయాధికారి జి.అనిల్ శుక్రవారం ఒక ప్రకటనలో మండల రైతులను కోరారు. 'యూరియా కోసం రైతుల అవస్థలు' సాక్షిలో వచ్చిన వార్తకు సంబంధిత అధికారులు స్పందించారు. మండలంలో అధిక విస్తీర్ణంలో సుమారుగా 6 వేల ఎకరాలలో మొక్కజొన్న పంటను సాగు చేయడం, ఇటీవల కురిసిన వర్షాలకు పంటకు యూరియా వేసేందుకు రైతులు ఆసక్తి చూపడంతో రద్దీ పెరిగిందన్నారు. మండలంలో యూరియా నిల్వలకు ఎలాంటి కొరత లేదని, ప్రస్తుతం 80 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. లైసెన్సు లేని వ్యాపారులు ఎరువులు, విత్తనాలు, ఇతర క్రిమి సంహారక మందులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డీఈఓ ఆకస్మిక తనిఖీ



ఉప్పునుంతల: అచ్చంపేట పట్టణంలో కొనసాగుతున్న మండలంలోని వెల్టూరు మహాత్మా జ్యోతిబా పూలే బాలికల రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలను శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రమేష్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు అందిస్తున్న భోజనం తదితర వసతులు పరిశీలించారు. ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు.

రోశయ్యకు ఘన నివాళి



కొల్లాపూర్: పట్టణంలోని గాంధీ చౌరస్తాలో ఆర్య వైశ్య సంఘం(ఆవోపా) ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి ఆవోపా నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో రోశయ్య పాత్ర మరచిపోలేమని కొనియాడారు. కార్యక్రమంలో ఆకుతోట సుదర్శన్‌శెట్టి, శేషయ్య, ప్రేమ్‌కుమార్, అర్థం రవి, చందనం శ్రీనివాసులు, రాంప్రసాద్, రాజశేఖర్, శ్రీదేవి, నిర్మల తదితరులు ఉన్నారు.

దోమలపెంట: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతిని శుక్రవారం ఈగలపెంటలోని శక్తి సదన్‌లో నిర్వహించారు. భూగర్భ కేంద్రం ఇంజినీర్లు నివాళులర్పించారు. ఎస్ఈలు ఆదినారాయణ, రవీంద్రకుమార్, ఇంజినీర్లు, ఉద్యోగులు, ఆర్టిజన్లు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు

కోడేరు: మండల కేంద్రంలోని బీసీ హాస్టల్ విద్యార్థులకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. 100 మంది విద్యార్థులకు ఆరోగ్య స్థితిగతులను పరీక్షించి కొలతలు, బరువు వివరాలను నమోదు చేశారు. అనారోగ్యంతో ఉన్న వారికి మందులు అందజేసినట్లు తెలిపారు. వార్డెన్ మహేష్, దేవిరాణి, చంద్రకళ, మహేశ్వరి, వీరభద్ర, శివ, అంజనమ్మ పాల్గొన్నారు.

చెన్నంపల్లిలో వైద్య శిబిరం

లింగాల: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని చెన్నంపల్లిలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి భూపాల్ 152 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అనంతరం వైద్య సిబ్బంది గ్రామంలో తిరిగి ఫీవర్ సర్వే నిర్వహించారు. డ్రైడే గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అచ్చంపేట డివిజన్ ఉప మలేరియా అధికారి బిక్‌లాల్, పర్యవేక్షకురాలు శాంతమ్మ, హెచ్ఏలు మల్లేష్, స్వామిలాల్, హతిరాం, మంత్రియా, ఏఎన్ఎం యాదాబాయి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఉచిత ఇసుక

తిమ్మాజిపేట: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఉచిత ఇసుక సరఫరా చేస్తునట్లు ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండలంలోని రాళ్ల చెరువుతండా సమీపంలో ఇటీవల కొందరు అక్రమంగా ఇసుక డంప్ చేశారు. ఉన్నతాధికారుల సూచన మేరకు శుక్రవారం డంప్ చేసిన ఇసుకను ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ఇసుక పంపిణీ చేస్తునట్లు పేర్కొన్నారు. పోలీస్, రెవెన్యూ అధికారులు డంప్ వద్ద లబ్ధిదారులకు ఇసుక పంపిణీ చేశారు.

పనులు వేగవంతం చేయాలి



తాడూరు: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈ రాజవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మండలంలో పాపగల్‌లో ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేశారు. అనంతరం ఏఈ మాట్లాడుతూ నిబంధనల మేరకు ఇళ్లు నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రమేష్, గ్రామస్తులు లింగం, తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి



తెలకపల్లి: వందశాతం ఉత్తీర్ణతకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాల బీసీ బాలుర గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి సందర్శించారు. గురుకులాల్లో సమస్యలను ప్రత్యేకంగా తనిఖీ చేశారు. వంట ఏజెన్సీలతో మాట్లాడారు. గురుకుల పాఠశాలల్లోని స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థులకు తాజా కూరగాయలను వినియోగించాలని అన్నారు. ప్రిన్సిపాల్ ఏఆర్ లక్ష్మి, తహసీల్దార్ జాకిర్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్ గ్రామ సమీపంలోని హైదరాబాద్– శ్రీశైలం జాతీయ రహదారిపై పెట్రోల్ బంక్ వద్ద శుక్రవారం తెల్లవారు జామున ద్విచక్రవాహన్నాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దాపూర్ గ్రామానికి చెందిన చిన్నయ్య లింగారెడ్డిపల్లిలో బంధువుల ఇంట్లో జరిగిన శుభ కార్యానికి వెళ్లి శుక్రవారం తెల్లవారు జామున బైక్‌పై వెంకటయ్య, చిన్నయ్య బయలు దేరారు. మార్గమధ్యలో హైదరాబాదు–శ్రీశైలం పెద్దాపూర్ సమీపంలో ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. మరో వాహనం వారి కాళ్లపై వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం వెంకటయ్యను 108 అంబులెన్స్‌లో కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాదులోని ఉస్మానియ ఆస్పత్రికి వైద్యు రిఫర్ చేశారు. చిన్నయ్యను వెల్దండ సమీపంలోని యెన్నమ్స్ ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.

మటన్ దుకాణాలు సీజ్

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాకేంద్రంలోని హౌజింగ్ బోర్డుకాలనీలోని ప్రధాన రహదారిపై ఉన్న మటన్ షాపుల యజమానులు మేకలు, పొటేళ్ల వ్యర్థ పదార్థాలను రోడ్లపై, మురికి కాల్వలపై పోస్తుండటంతో దుర్వాసన వెదజల్లుతుండటంతో స్థానికులు మున్సిపల్ కమిషర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం శానిటరీ సిబ్బంది మటన్ దుకాణాలను పరిశీలించారు. వ్యర్థాలను రోడ్లపై పారబోస్తున్న మటన్ దుకాణాలను గుర్తించి తాళం వేసి సీజ్ చేశారు.

వివాహిత అదృశ్యం: కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: వివాహిత అదృశ్యమైన ఘటనలో శుక్రవారం కేసు నమోదైంది. ఎస్ఐ గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కుమ్మెర గ్రామానికి చెందిన మహేశ్వరి ఈ నెల 3న ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లింది. కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆమె ఆచూకి లభించలేదు. స్థానిక పోలీస్‌స్టేషన్ మహేశ్వరి భర్త ఆశీర్వాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

200 లీటర్ల డీజిల్ అపహరణ

చారకొండ: మండల కేంద్రంలో జడ్చర్ల –కోదాడ జాతీయ రహదారిపై ఆపిన లారీల నుంచి 200 లీటర్ల డీజిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం వేకువజామున అపహరించారు. లారీ డ్రైవర్ బీమేష్ తెలిపిన వివరాల ప్రకారం గురువారం రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి నుంచి లారీలో రాయి పౌండర్ లోడ్‌తో చెన్నై వెళ్తుండగా అర్ధరాత్రి చారకొండ పెట్రోల్ బంకు సమీపాన లారీని నిలిపి నిద్రించాడు. ఉదయం డ్రైవర్ లారీని ఆన్ చేయగా డిజీల్ అయిపోయినట్లు సిగ్నల్ రావడంతో వెంటనే లారీ దిగి ట్యాంకును పరిశీలించగా డీజిల్ చోరీకి గురైందని గుర్తించాడు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

రేషన్‌బియ్యం పట్టివేత

వంగూరు: మండలం రంగాపూర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 39 బస్తాల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. శుక్రవారం ఉదయం విశ్వసనీయ సమాచారం మేరకు రంగాపూర్ గ్రామానికి చెందిన సాయిబాబా షాపులో నిల్వ ఉన్న 13 బస్తాల దొడ్డుబియ్యం, 26 బస్తాల సన్నబియ్యాన్ని స్వాధీన పర్చుకుని సివిల్ సప్లై అధికారులకు సమాచారం ఇచ్చారు. పంచనామా చేసి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో జైలుశిక్ష

వెల్దండ/తాడూరు/కల్వకుర్తి టౌన్: మండల కేంద్రంలో నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో కల్వకుర్తి మండలం బెక్కెర గ్రామానికి చెందిన దార రామకృష్ణ పట్టుబడ్డాడు. ఈ మేరకు నిందితుడిని శుక్రవారం కల్వకుర్తి కోర్టులో హాజరపర్చారు. జడ్జి జాడ కావ్య నిందితుడకి మూడు రోజుల జైలు శిక్షతో పాటు రూ.600 జరిమానా విధించింది. నాగర్‌కర్నూల్‌కు చెందిన వెంకటయ్యకు ఒక రోజు జైలు శిక్ష, ఎల్లికట్టకు చెందిన సత్యనారికి ఒకరోజు జైలు శిక్షతో పాటు రూ.600 జరిమానాను విధించారు.